ఇండియా టుడే: 28-7-1998

# లాగుట్టు

లేడికి లేచిందే పరుగు. అలాగే మంత్రిగారికి బుర్రలో ఆలోచన రావడమేమిటి, కార్యరూపం దాల్చడ మేమిటి, అన్నీ క్షణంలో జరిగిపోయాయి.

మంత్రిగారి రూపం మారిపోయింది.

చెదరని క్రాపు, నున్నటి గడ్డం స్థానే వెంకన్నస్వామికి మొక్కుకున్న వాడిలా పెరిగిన గడ్డం, చీకేసిన టెంకలా జుత్తు, జిడ్డోడుతున్న మొహం.

ఇస్త్రీ చేసిన చలువ ఖద్దరు గుడ్డలకు బదులు పల్నాటి ముతక పంచె, మాసిన చొక్కా పైన ఎర్ర కండువా.

అద్దంలో చూసుకుంటే, పాపం భార్య లేచిపోయిన వాడిలాగా, లేదా కొన్ని మాసాలుగా కడుపులో పుండు, ఆపైన మతిస్థిమితం లేని వాడిలా మంత్రిగారు రూపాంతరం చెందారు.

"ఎలా వుందీ వేషం?"- మనసు ఉగ్గపట్టుకోలేక పి.ఏ. రంగారావును రహస్యంగా అడిగారు.

పి.ఏ. రంగారావు ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ ఏనాడూ ఆఫీసులో నిర్ణయించిన ఉద్యోగం చెయ్యలేదు. ఫైలు రాయలేదు. పట్టు పరిశ్రమ విలువ తెలుసుకున్న జ్ఞాని అవడం వల్ల సౌఖ్యం, రాబడీ, పలుకుబడీ ఎక్కడుంటాయో తెలుసుకుని, మంత్రిగారి కార్యాలయంలో టైపిస్టుగా, క్లార్కుగా చేరి అంచెలంచెలుగా పి.ఏ. స్థాయికి ఎదిగిన ఘనుడు. పార్టీలు - ప్రభుత్వాలు మారినా పి.ఏ. పదవి వదలని జ్ఞాని. అందువల్ల మంత్రిగారు తన అవతారం ఎలా వుందీ అని అడగ్గానే మొహంలో రంగులు మార్చేసి, దీనాతిదీనంగా మొహం పెట్టి -

"సార్, నేనింతవరకు ముప్పయ్ మంది మంత్రుల దగ్గర పనిచేశా సార్. మీలా ప్రజాసేవకు అంకితమైన వాళ్ళు లేరంటే మా అమ్మ మీద, పిల్లల మీద ఒట్టు సార్. మిమ్మల్ని ఈ రూపంలో చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది సార్. గర్భ దరిద్రంతో, రోగాలతో చిక్కి శల్యమైన వాళ్ళను ఎంతోమందిని చూశాగాని సార్, వాళ్ళెవ్వరూ మీకు సాటి రారు సార్" అని సుదీర్ఘంగా విచారం వ్యక్తం చేశాడు.

"ఈ రూపంలో నన్నెవ్వరూ గుర్తు పట్టరు గదా?"

"అసాధ్యం. కావాలంటే మీరీ ఆకారంతో అమ్మగారి దగ్గరి కెళ్ళండి. లేదంటే మీ గరల్‌ఫ్రెండ్ దగ్గర కెళ్ళండి. అదీ కాదంటే, ఓసారి ముఖ్యమంత్రిగారి చేంబరుకు వెళ్ళండి. అబ్బే నేనే మిమ్మల్ని పోల్చుకోవడం కష్టమైంది సార్" అని రంగారావు హామీ ఇచ్చాడు.

మంత్రిగారి మనసు కుదుట పడింది. ధైర్యం వచ్చింది. తాను చేస్తున్న పని అద్భుతం ఇంతవరకు ఏ మంత్రీ, ఏ ప్రభుత్వంలోనూ, ఏ రాష్ట్రంలోనూ చేసి ఉండదరు. తాను చేసిన పని ప్రజలకు తెలిసి ఆశ్చర్యపోతారు.

"ఆహా మంత్రీ! నువ్వయ్యా అసలు సిసలు ప్రజాసేవకుడివి. నీ చర్య వల్ల మా జీవితాలు ధన్యమైనాయి" అని ముక్తకంఠంతో అభినందనలు కురిపిస్తారు.

పత్రికలవాళ్ళు సరేసరి. పతాక శీర్షికలతో 'మంత్రి మారువేషం', 'అవినీతికి అంతం - మారువేషంలో మంత్రివర్యులు' అని ప్రముఖంగా ప్రచురిస్తారు. టీవీల వాళ్ళు ఆశ్చర్యపోయి, పరుగు పరుగున వచ్చి తనతో ఇంటర్వ్యూలు, జీవిత విశేషాలు సేకరించి ధారావాహికంగా ప్రసారం చేస్తారు. తన పేరు ఊరు ఊరునా మార్మోగిపోతోంది. దేశదేశాల తెలుస్తుంది.

అంతేగాదు, తన మీద గిట్టని వాళ్ళు, ప్రతిపక్షాల వాళ్ళు చేసిన ఆరోపణలు, లంచ గొండితనం, ఆశ్రిత పక్షపాతం, ఉద్యోగాలు, బదిలీల్లో తీసుకున్న లంచం, రాబడికి మించిన ఆదాయం, కొడుకు చేసిన మానభంగాలు, దౌర్జన్యాలు వగైరా నిందలన్నీ మాసిపోతాయి. అందరూ ఒక్కసారిగా మంత్రం వేసినట్లు మర్చిపోతారు.

తానొక హీరో అవుతాడు. ముఖ్యమంత్రి తన వేపు గుర్రుగా చూడడు. ఎప్పుడు మంత్రివర్గ మార్పులు జరిగినా, తన పదవిని ఏ వంకన పీకాలా అని ఆలోచన చేయడు.

ఇహ మంత్రివర్గ సహచరుల ముందు తానొక ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపు పొందుతాడు. గౌరవంగా చూస్తారు. ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్., తదితర అధికారులు తన దగ్గర భయభక్తులతో మెలగుతారు.

అబ్బో తాను చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతం, అపూర్వం అని మంత్రిగారు నమ్మారు.

పెళ్ళానికీ, పిల్లలకూ, సహచరులకు, అనుయాయులకు, ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డారు. తన దగ్గర పని చేసే డ్రైవర్లు, బంట్రోతులు, ఆంతరంగికులకు తెలియ కుండా కార్యరంగంలోకి దిగారు.

"రంగారావూ జాగ్రత్త! నా విషయం బయటకు పొక్కిందో నీ ప్రాణాలు తీస్తా. నీ పెళ్ళాం పిల్లల్ని లారీ కింద పెట్టి చంపుతా. నే తిరిగి ప్రత్యక్షమయ్యే దాకా రహస్యం కాపాడు" అని హెచ్చరించారు.

ఓ ఉదయాన మంత్రిగారు నగరంలో ప్రముఖ జనరల్ హాస్పిటల్‌కు వెళ్ళారు. అవుట్ పేషంట్ వార్డులో కూలబడ్డారు.

వార్డంతా శుభ్రంగా ఉంది. వార్డ్ బాయ్‌లు యూనిఫామ్‌లు ధరించి శ్రద్ధగా పనిచేస్తు న్నారు. నర్సులు మల్లెపువ్వులా ఉన్నారు. నవ్వుతూ, అప్యాయంగా పలకరిస్తూ.

పిల్ల డాక్టర్లు, పెద్ద డాక్టర్లు నిర్ణీత సమయానికి వచ్చి, చకచకా రోగులను పరీక్షించి మందులు ఇస్తున్నారు.

మంత్రిగారు పెద్ద డాక్టరు దగ్గరకు వెళ్ళగానే, ఆయన చాలాకాలానికి కనిపించిన చిన్ననాటి స్నేహితునిగానో, బాబాయి కొడుకుగానో భావించి ఆప్యాయంగా పలకరించి, బల్ల మీద పడుకోమనీ, కళ్ళు, నోరు చూసి, పొత్తి కడుపు నొక్కి, "అరెరే, చాలా బలహీనంగా ఉన్నారు. అసలెందుకింత అశ్రద్ధ చేశారు? ఇది ప్రజల ఆస్పత్రి గదా. మీలాంటి వాళ్ళ కోసమే ఉంది. రావచ్చు గదా. మేం నయాపైసా తీసుకోం. అన్ని పరీక్షలూ ఉచితంగా చేస్తాం. మందులిస్తాం. పొరపాటు చేశారు. పోన్లెండి. మంచి పని చేశారు. ఇప్పటికైనా వచ్చారు. సంతోషం. రెండ్రోజులు వార్డ్‌లో ఉండండి. ఏం భయం లేదు. అన్ని పరీక్షలు చేద్దాం" అని హామీలు, అభయం ఇచ్చారు.

"ఒరేయ్ లివింగ్‌స్టన్. ఈ బాబుగారిని ఏడో వార్డులో పడుకోబెట్టు" అని ఆజ్ఞ జారీ

చేశారు.

"అయ్యో, మీరు కదలొద్దు. తోపుడు బండి వస్తుంది. అరేయ్ స్ట్రెచర్ తీసుకురా" అని ఏకపాత్రాభినయం చేశారు.

మంత్రిగారు, పెద్ద డాక్టర్ ప్రేమకు, వృత్తి మీద గల శ్రద్ధకు ఆశ్చర్యపోయి నోరెళ్ళ బెట్టారు.

"నే నడవగలను" అన్నారు మంత్రిగారు.

"కూడదు" అని పెద్ద డాక్టరు ఘంటాపథంగా చెప్పి, "ఇది ప్రజల అస్పత్రి. చేరేంతవరకే మీ బాధ్యత. చేరాక మీ పూర్తి బాధ్యత మాది. మేం ఎందుకున్నాం? మీ సేవ కోసమే. అది గుర్తుంచుకోండి" అన్నారు పెద్ద డాక్టరు.

స్ట్రెచర్ వచ్చింది. దాని మీద మంత్రిగారు మూడంకె వేసుకుని పవళించారు.

స్ట్రెచర్‌పై వార్డుకు ప్రయాణం చేస్తూ మంత్రిగారు అన్నీ పరిశీలించారు.

ఆస్పత్రి గోడలు, తలుపులు, వరండాలు, ఖాళీ ప్రదేశం అన్నీ శుభ్రంగా ఉన్నాయి. చెత్త కుండీలు ఖాళీగా ఉన్నాయి. మెట్ల దగ్గర, గోడల మూలల్లో కిళ్ళీ మరకలు, ఉమ్ములు లేవు. ఎంత ఆశ్చర్యం!

'ఆహా' అని మురిసిపోయారు మంత్రిగారు.

ఏడో నంబరు వార్డు శుభ్రంగా ఉంది. ఇనుప మంచాలపై కొత్త దుప్పట్లు, తిరుగుతున్న ఫ్యాన్లు - వార్డంతా ఫినాయిల్ వాసన.

చకచకా పని చేసుకుంటున్న వార్డ్ బాయిలు, నర్సులు, కుర్ర డాక్టర్లు. ఉన్న రోగులు కూడా బాధలు, నొప్పులు, రోగాలు. ఈతి బాధలు మర్చిపోయి ఏదో విశ్రాంతి గృహంలో సేద తీరుతున్నట్లున్నారు.

'ఆహా! ఓహో' అనుకున్నారు మంత్రిగారు.

మంత్రిగార్ని బెడ్ మీదకు దొర్లించి స్ట్రెచర్ తెచ్చిన లివింగ్‌స్టన్ క్షణం ఆగి, "పోయొస్తా" అన్నాడు విష్ చేసి.

మంత్రిగారు అతని మర్యాదకు, వినయానికి ముగ్ధుడై చిరునవ్వుతో "పోయిరా" అన్నారు, తానూ విష్ చేసి.

అతను పోలేదు సరికదా, "మళ్ళీ రాను. డ్యూటీ దిగే వేళయింది" అన్నాడు.

"మంచిది" అన్నారు మంత్రిగారు కడుపు కాలుతుండడంతో.

లివింగ్‌స్టన్‌కు ఒళ్ళు మండింది. కొరికేలా చూశాడు. వీలయితే మింగేసేవాడే.

"దేఖ్‌లేతుం! పైసలియ్యకుంటే ఈడ చావు కూడా రాదు బే! నువ్వెట్లా పోతావో చూస్తా" అని వెళ్ళాడు.

మంత్రిగారికి కోపం వచ్చింది. పౌరుషం వచ్చింది. తమాయించుకున్నారు. తాను ప్రస్తుతం మంత్రి కాదు. మారువేషంలో ఉన్నాడు. లేకపోతే ఆ అన్నవాడిని పిచ్చి కుక్కలా

కరిచేవాడు. ముక్కలుగా నరికి బ్రాందీలో వేయించుకు తినేవాడు.

కళ్ళు మూసుకుంటే ఆకలి గుర్తొచ్చింది. కోడి పలావు... చికెన్ బిర్యానీ, వాట్ 69, ఏ.సి.రూమ్, గరల్‌ఫ్రెండ్ నగ్నశరీరం - అయ్యో అన్నీ వదులుకుని, ఆస్పత్రి బెడ్ మీద రోగిష్టివాడిలా పడుకోవడం. ఇక్కడ తిండి ఎప్పుడు పెడతారో, ఏం పెడతారో తెలియదు. ఆ తిండి తింటే ఏమవుతుందో? - అదో బెంగ, దిగులు.

ఛీ! ప్రజాసేవ చెయ్యడం చాలా కష్టమనిపించింది. లేచి, 'నేను ఫలానా! ఖబడ్దార్!' అందామనిపించింది. కానీ, భవిష్యత్తు గుర్తొచ్చింది. మంత్రి పదవి శాశ్వతంగా ఉండాలన్నా, తన కీర్తి పెరగాలన్నా ఈ కష్టాలు తప్పవు.

చిన్న కునుకు పట్టింది. కలలొచ్చాయి. ముఖ్యమంత్రి పదవి కళ్ళ ముందు మెదలాడింది. బారులు తీర్చిన కారులు..జనం.... జయజయ ధ్వానాలు... ఫోటోలు... దండలు.. ఆహా! ఎంత గొప్ప!

నర్స్ వచ్చి తట్టి లేపింది. ఆమె స్పర్శకు నరాలు జిల్లుమని లాగాయి. నోరు తెరిచాడు. ఓ గోలీ నోట్లో వేసి, నీళ్ళు పోసింది. మింగాడు. అంగిలంతా చేదు.

నర్స్ నవ్వింది - "చేదు కదా. పడుకోండి. ఓ గంటలో అన్నం వస్తుంది. తినండి. హాయిగా నిద్రపోండి. రేపీపాటికి మీ జబ్బు సర్దుకుంటుంది, ఏం! సాయంత్రం దాకా ఇక్కడే డ్యూటీ. అవసరమైతే పిలవండి" అని చెప్పి వెళ్ళింది.

ఆకలి. అది తీరాలి. ఆస్పత్రి కూడు ఎలా వుంటుందో? జైలు తిండి ఎప్పుడో తిన్నాడు. ఇప్పుడు గుర్తుకు రావడం లేదు. పదవిలోకి వచ్చాక అన్నీ మర్చిపోయాడు. బంగళాలు, ఏ.సి. రూములు, వంగి వంగి దణ్ణాలుపెట్టే అధికార్లు, వినతి పత్రాలతో ఆశగా వచ్చే జనం, కోరుకున్న తిండి, కడుపు నిండాక మెత్తటి పక్క పక్కలో ఆడది. ఆహా - ఆ సుఖం గుర్తొచ్చింది కానీ, సబ్ జైలు, సెంట్రల్ జైలు తిండి, జీవితం గుర్తుకు రాలేదు.

చుట్టూ చూశాడు. కొందరు వేదాంతుల్లాగా ఉన్నారు రోగులు. మరి కొందరు ఎప్పుడు ఇంటికి పోదామా అని ఆశగా దిక్కులు చూస్తున్నారు. మిగతా వాళ్ళు పెట్టే తిండీ, ఇచ్చే మందులు ఇవి చాలు అని సంతృప్తిగా ఉన్నారు. బహుశా వీళ్ళు అతి సామాన్యులు అయి ఉంటారు.

మంత్రిగారికి నీరసం వచ్చింది. ఆకలి మండిపోతున్నది. వచ్చీరాని నిద్ర. ఉక్క. నలుగురి కోసం ఉన్న ఫ్యాను తిరుగుతున్నది కానీ, గాలి పంచడం లేదు.

ఏం చెయ్యాలి? ఏం తోచడం లేదు. ఆఫీసులోనో, ఇంట్లోనో వుంటే, కళ్ళతో ఆజ్ఞలు జారీ చేయవచ్చు. సౌంజ్ఞలతో పనులు జరిపించుకోవచ్చు. కానీ, ఇది ఆస్పత్రి. తాను రోగి మారువేషంలో ఉన్న మంత్రి.

ఒంటి గంటకు అన్నం బండి వచ్చింది. వార్డులోని రోగులంతా రెక్కలొచ్చిన కొంగల్లాగా లేచి కూర్చున్నారు. కంచాలు అందుకుని అవురావురుమంటూ తినసాగారు.

మంత్రిగారు పళ్ళెంలో అన్నం, సాంబారు, కోడిగుడ్లు చూసి, అదే పరమాన్నం లాగా తిన్నారు. రుచిగా ఉన్నాయనిపించాయి. ఆహా, ప్రభుత్వం బాగానే ఉంది. ఆస్పత్రులు రోగులకు బ్రహ్మాండంగా సేవ చేస్తున్నాయి. తన శాఖపై వచ్చిన ఆరోపణలు అబద్ధం కావాలంటే ప్రతిపక్ష నాయకులను 'జన్మభూమి' కార్యక్రమం కింద విధిగా, ఆస్పత్రులలో రోగులుగా చేర్చాలి - తెలిసొస్తుంది.

ఇలా ఎన్నో ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకుంటుండగా మంత్రిగారు నిద్ర పోయారు, అలసి సొలసి, ఆదమరిచి!

సాయంత్రం అయింది. దీపాలు వెలిగాయి.

రోగులు చుట్టూ బంధువులు. స్నేహితులు.. కోలాహలంగా ఉంది. పెళ్లికొచ్చిన బంధుజనంలా పలకరింపులు, పరామర్శలు. ఆస్పత్రి మహా సందడిగా ఉంది.

మంత్రిగారిని చూసేందుకు ఎవరూ రాలేదు. రావద్దని కదా హుకుం.

మంత్రిగారు నీరసంగా నడుస్తూ ఆస్పత్రి ఆవరణంతా తిరిగారు.

ఆస్పత్రి అంతా కోలాహలంగా ఉంది. మాటలు, ముచ్చట్లు, నొప్పులు, బాధలు, ఏడుపులు. అయినా, అంతా ఆనందంగానే ఉన్నారు. ప్రభుత్వాసుపత్రిలో బతికినందుకు కొందరు సంతోషిస్తున్నారు. ఎందుకు చావలేదూ. ఇదేమన్నా మాయా. ఇంద్రజాలమా! బతికి ఏం చేయాలి అని దుఃఖించే రోగులూ, భగవంతుడి లీల ఇంతే అనుకుని సంతృప్తి గానే ఉన్నారు.

ఆస్పత్రి అవతల బతుకు, జీవితం, జీవన విధానం - యధావిధిగానే ఉంది. లైట్లు, దోమలు, ఈగలు, పందులు, కుక్కలు, గాడిదలు, ఆవులు, అనాథలు, ఆర్తులు, మాన్యులు, సామాన్యులు, భోగపురుషులు, భాగ్యవంతులు - అందరూ - ఆస్పత్రి వేపు చూడకుండా గమ్యాలకు వెడుతున్నారు.

మంత్రిగారికి చికాకు, విసుగు, నైరాశ్యం అన్నీ కలిగాయి. అంతా బాగానే ఉంది. మరెందుకు తానీ సాహసం చేశాడు. ఏం సాధిద్దామని!?

ఏం తోచలేదు.

మళ్ళీ వచ్చి బెడ్ మీద వాలారు. మగత నిద్ర. ఓపిక లేకపోవడం, తిన్న తిండి చాలక పోవడం, బెడ్ మీద శవంలా పడుకోవడం - ఛీ! వెధవ పని చేశానేమో అన్న దిగులు. ఎందుకొచ్చినట్లు? ఏం బాగుచేద్దామని? ఏం సాధిద్దామని?

ఏమీ అర్థం కాలేదు.

నిద్ర, నీరసం, ఆకలి. రాత్రికి మళ్ళీ సాంబారన్నం.

మళ్ళీ జీవితం మీద విరక్తి.

ఛీ! ఈ సాంబారన్నం తింటే రోగాలు రావు, ఉన్న రోగాలు పోవు. బతుకు మీద ఇచ్ఛ పోతుంది. అంతే!

నర్స్ మళ్ళీ వచ్చి ఓ గోలీ వేసి వెళ్ళింది. 'నిద్రపొండి' అని సలహా కూడా ఇచ్చింది.

మంత్రిగారు నిద్ర పోయారు.

ఏమి చేసేందుకూ తోచక, ఆకలి మంటకు తాళలేక నీరసం.

ఓ రాత్రివేళ మెలకువ వచ్చింది. నల్లులు కడుతున్నాయో, దోమలు కరుస్తున్నాయో తెలియదు. లేచి కూర్చున్నాడు.

మాటలు వినపడుతున్నాయి ఎక్కడ నుంచో.

ఆ మాటల్లో పి.ఏ. రంగారావు గొంతు కూడా ఉంది. మంత్రిగారు గుర్తించారు. ఇతనెందుకు వచ్చాడు? వచ్చినవాడు తన దగ్గరకు ఎందుకు రాలేదు? వచ్చి ఏం చేస్తున్నాడు?

మంత్రిగారు గూఢచారి లాగా వెళ్ళి ఆ గది దగ్గర పొంచి అంతా విన్నారు.

"పి.ఏ.గారూ మీరు చెప్పినట్లు అన్ని ఏర్పాట్లు చేశా. మంత్రిగారికి తెలియకుండా జాగ్రత్త పడ్డా. ఆఖరికి ఏడో నంబరు వార్డులో రోగులనూ మార్చా. ఆయన కళ్ళకు అంతా సవ్యంగా కనపడేలా చేశా. వార్డు బాయిలు, నర్సులు, కుర్ర డాక్టర్లు అంతా చక్కగా నటించేలా చేశా! ఇక నా భవిష్యత్తు మీ చేతిలో ఉంది. నా మీద ఆరోపణలు కొట్టేయించాలి."

"ఓ.కే. అంతా చేయిస్తా. రేపు మంత్రిగారు ఆఫీసుకు రాగానే అన్నీ అయిపోతాయి. ఈ రాత్రికి ఈ నాటకం సుఖాంతం అయ్యేలా చూడండి" అన్నాడు పి.ఏ.

మంత్రిగారు ఇన్‌కంటాక్సు వాళ్ళు ఇల్లు సోదా చేసినట్లు, ప్రమాణ స్వీకారం రోజే మంత్రి పదవి పోయినట్లు నీరుకారి పోయారు.

"ఓరి దొంగా! నువ్వు నా ప్లానంతా చెప్పి, నా ప్రయత్నం ఇలా అభాసుపాలు చేశావా! నన్నూ, నా పదవినీ వాడుకుని డబ్బూ, అధికారం చలాయించి నన్ను వెధవను చేస్తావా! నీచుడా! నీవు ఒళ్ళో నిప్పువని, లంకకు చేటు తెచ్చిన సుగ్రీవుడవని, పాలు పోసిన చేతినే కరిచే పాముననీ తెలుసుకోలేకపోయాను. వెధవా..." - ఇలా ఏదో అనబోయి అనలేక, ఆవేశం ఆపుకోలేక, ఆగ్రహం ప్రదర్శించలేక, అడుగు ముందుకు పడక, నోట మాట రాక మంత్రిగారు ఉన్న చోటునే పడిపోయారు.

మర్రోజు పేపర్లు, రేడియో, టీవీ అన్నీ పెద్ద హెడ్డింగ్‌లతో ప్రముఖంగా ప్రచురించాయి. ప్రసారం చేశాయి.

"మంత్రిగారికి పక్షవాతం. చేయి, నోరు, కాలు పడిపోయాయి."

"సమయానికి పి.ఏ. డాక్టర్లు అక్కడే ఉండబట్టి ప్రాణాపాయం లేదు."

పి.ఏ. వేరే మంత్రిగారి కొలువులో చేరాడు.

డాక్టర్‌కు ప్రమోషన్ వచ్చింది.

మంత్రిగారికి మాత్రం మాట రాలేదు. ●